ఆరుగురు సభ్యులతో అంధుల కచేరీ బృందం ఏర్పాటైంది. కుమారి తమ్ముడు కృష్ణారావు కన్వీనర్‌గా కుదిరాడు. అతనికి అన్ని అవయవాలూ సక్రమంగా ఉండటంతోపాటు ఏ పనీ లేనందువల్ల.. కుమారి ఏరికోరి అతణ్ని రప్పించింది. అతను ఆ అంధుల బృందాన్ని నడిపించే రథసారథి అయ్యాడు.

ధర్మభిక్షం, కుమారి, పాపమ్మ వరుసగా పాటలు పాడుతుంటారు. బుజ్జి కంజిర వాయిస్తుంది. వీరేసు చేతితో పనిచేసే ఆర్గాన్‌తో సంగీతాన్ని పలికిస్తుంటాడు. దేముడుబాబు లయబద్ధంగా తబలా కొడుతుంటాడు. మొదట పాడుతున్న పాటలకు.. వీరి సంగీతానికి సంబంధం అంతగా ఉండేది కాదు. కానీ, రానురానూ పాటలకు ఈ సంగీతమే ప్రాణమైపోయింది.

ఈ అంధుల బృందం పాడే పాటల్లో సంగీతం ఏరులై ప్రవహించేది. గ్రామ దేవతల పండుగలు, వినాయక చవితి, నవరాత్రి ఉత్సవాల సమయాల్లో రాత్రిపూట వీరి పాటల కచేరీలు అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు అవుతున్నాయి. ఒక ప్రదర్శనకు రెండు మూడు వేలు మాత్రమే ఆశించే ఈ బృందానికి.. ఎక్కడబడితే అక్కడ స్వాగత సత్కారాలు లభిస్తున్నాయి. బృందంలో ఉన్నవారు అందరూ అంధులే అయినందున వీరి ప్రదర్శనలు ఎక్కడ జరిగినా చాలామంది హాజరవుతున్నారు. కృష్ణారావు కన్వీనర్‌గా వివిధ గ్రామాల్లో నాయకుల్ని కలుసుకుంటూ.. వీరికి అవకాశాలు కల్పిస్తున్నాడు. వారందరితోపాటు తను కూడా ఒక భాగం వాటా సొమ్ము తీసుకుంటున్నాడు.

ఒకప్పుడు రైల్వేస్టేషన్ బయట పాటలు పాడుతూ యాచకులుగా ఉన్న వీరి పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఎంతోమందికి ఆదర్శంగా వీరి కార్యక్రమాలు తయారయ్యాయి. కొన్ని పత్రికల్లో వారి సంగీత కచేరీల గురించి ఆసక్తికరమైన వార్తలు వెలువడ్డాయి.

''ఈ వారంలో మనం అనకాపల్లి వెళ్లాలి. నువ్వు పుట్టి – పెరిగిన.. పాటలు పాడిన ఆ రైల్వేస్టేషన్ ఎదుటే మన పాటల కార్యక్రమం ఏర్పాటు చేశారని మా తమ్ముడు చెప్పాడు'' అని చెప్పింది కుమారి.

అనకాపల్లి పేరు వినగానే ధర్మభిక్షం ఓ విధమైన అనుభూతికి లోనయ్యాడు. రోజూ స్టేషన్ ముందు పాటలు పాడటం గుర్తుకువచ్చింది. కుమారి సలహాతో బృందాన్ని ఏర్పాటుచేసిన విషయం కూడా గుర్తుకువచ్చింది.

'నా వాళ్లు ఎవరూ లేకపోయినా.. నేను తెలిసినవాళ్లు ఉన్న అనకాపల్లికి ఎప్పుడు వెళ్తానా!?' అని అతని మనసు ఉవ్విళ్లూరింది.

తల్లి అని అతను భావిస్తున్న కంజిరమ్మ కూడా గుర్తుకువచ్చింది. రెండురోజుల్లో అనకాపల్లి వెళ్తారనగా..

''అందరికీ పెద్ద దిక్కుగా ఉన్న నీకు రుణపడి ఉన్నాం. అడుక్కోవడం నుంచి బయటపడాలని నేను చెప్పిన విషయాన్ని నువ్వు ఒప్పుకొని ఈ స్థాయికి తీసుకుని వచ్చావు. నీకు ఏం ఇవ్వగలను నేను'' అన్నది కుమారి.

ధర్మభిక్షం రెండు నిమిషాలు ఏమీ మాట్లాడలేదు.

''నీ ఆలోచనతో మన పరిస్థితి మారిపోయింది. నువ్వు నాతో ఉండటమే నాకు కొండంత అండ. ఒంటరితనం కూడా పోయినట్లుంది'' అన్నాడు నెమ్మదిగా.

'కానీ.. నీకేదైనా ఇవ్వాలి!' అందామని అనుకున్నది. కానీ, మనసులోంచి మాటలు బయటికి రాలేదు.

ఆరుగురు కలిసి అనకాపల్లి చేరుకున్నారు. నిర్వాహకులు వారికి చిన్న గదిని కేటాయించి..

''కార్యక్రమం రాత్రి ఉంది. అంతవరకూ విశ్రాంతి తీసుకోండి'' అంటూ వెళ్లిపోయారు.

ఊరంతా తిరిగి వస్తానని కుమారి కూడా వెళ్లిపోయింది. అనకాపల్లి చేరగానే ధర్మభిక్షానికి తెలియని అనుభూతి కలిగింది. గదిలో విశ్రాంతి తీసుకుంటున్నా.. చిన్నతనం నుంచి తను తిరిగిన ఆ జ్ఞాపకాలే మనసులో మెదులుతున్నాయి. ఆ పరిసరాలేవీ తను ఏనాడూ చూడలేదు. కానీ, తన సొంత ఇంటికి వచ్చిన మాదిరిగా అనిపించింది. తనను 'ఘంటసాల' అనుకునే ఆనాటి మనుషులు ఎవరైనా గుర్తించకపోతారా!? అని కూడా మనసు తహతహలాడింది.

'పుట్టుకతో చూపులేని వారు బృందంగా పాటలెలా పాడతారా?' అని ఎంతోమంది వచ్చారు.

ధర్మభిక్షం పాటలను అందుకున్నాడు. ఒక్కోపాట అతని గొంతులోంచి ప్రవాహంలా వస్తున్నది. మృదుమధురమైన కంఠంలోంచి తెరలు తెరలుగా వస్తున్న పాటలు.. అక్కడి వారిని చుట్టుముట్టాయి. ఒక్కోపాట ముగిసిన వెంటనే వినిపిస్తున్న కరతాళధ్వనులు.. వందల సంఖ్యలో శ్రోతలు ఉన్నారన్న విషయం, కనిపించని ధర్మభిక్షం కళ్ల వెనుక మనసు గ్రహించింది.

తమ స్టేషన్ ముందు ఒంటరిగా పాటలు పాడుతూ భిక్షం ఎత్తుకున్న ఒకనాటి నిరుపేద ధర్మభిక్షాన్ని చాలామంది గుర్తించారు. కచేరీ జరుగుతుండగానే అక్కడున్న యువకులు ఎంతో ఉత్సాహాన్ని చూపించారు. వచ్చిన వారి నుంచి డబ్బులు వసూలు చేశారు.

పది, ఇరవై, యాభై రూపాయల నోట్లతో పూలదండ మాదిరిగా తయారుచేశారు. అక్కడున్న నాయకుల్ని పిలిచి ధర్మభిక్షం మెడలో ఆ దండ వేసి అభినందించారు. శ్రోతలు చప్పట్లతో అభినందనలు తెలియజేశారు.

ధర్మభిక్షానికి జరుగుతున్నదేంటో అర్థం కాలేదు. అక్కడేం జరుగుతున్నదో వాద్య బృందానికి కనిపించడం లేదు. వేదిక మీద ఏదో జరుగుతుందన్న విషయం మాత్రం వారి మనోఫలకంలో మెదులుతున్నది.

'ఆ వేదిక మీద కుమారి ఎక్కడుందా!?' అని ఒక్క క్షణం ఆలోచించాడు.

''ఈ పాటగాళ్లంతా అంధత్వం శాపం కాదని నిరూపించారు. చూపులేని గానగంధర్వులుగా తయారయ్యారు. బృందాన్ని నడిపిస్తున్న ధర్మభిక్షం ఈ స్టేషన్ ముందే తన గానాన్ని మొదలుపెట్టాడు. ఈ అంధుల కచేరీ బృందం మరింత అభివృద్ధి చెందాలి''..

ఎవరో ఉపన్యాసం చెబుతున్నారు.

కచేరీ బృంద సభ్యులకు అప్పుడు అసలు విషయం అర్థమైంది. ఉత్సాహం ఉప్పొంగిన వీరేసు.. తన ఆర్గాన్‌తో రకరకాల రాగాలను పలికించాడు. దేముడుబాబు ఆగకుండా అయిదు నిమిషాలు నిర్విరామంగా తబలా వాయించాడు. ప్రేక్షకుల నుంచి చప్పట్లే.. చప్పట్లు!

ధర్మభిక్షం పక్కనున్న వ్యక్తిని మైక్ అడిగి తీసుకున్నాడు. అతనెప్పుడూ వేదికపై మాట్లాడలేదు. తనకు జరిగిన సన్మానానికి స్పందనగా మాట్లాడాలనిపించి గొంతు సవరించుకున్నాడు.

''మీరు మా మీద చూపించిన అభిమానం మరవలేనిది. మరుపురానిది. మేమంతా అంధులమైనా మాలోని కళను ఆరాధించారు. అభినందించారు. మీరు నాకు వేసిన నోట్ల దండ విలువ ఎంత ఉంటుందో నాకు తెలియదు. దీనికి ఎవరూ విలువ కట్టలేరు. ఇది నా ఒక్కడికే కాదు.. మా అందరికీ చెందుతుంది. మేం ఎవరం మా కళ్లతో మిమ్మల్ని చూడలేం. కానీ, మా హృదయాలతో మీ ప్రేమను కొలవగలం. గుండెల నిండా దాచుకోగలం. మాకు కళ్లు వచ్చి ఈ అందమైన ప్రపంచాన్ని, రంగుల్ని, ప్రకృతి అందాలను కళ్లారా చూసినంత ఆనందంగా ఉంది. మీ ప్రేమతో మాకు కొత్త ప్రపంచాన్ని చూపించారు. 'నేను అనాథను కాదు' అనే విషయం మీ అభిమానంతో అర్థమైంది''.. ధర్మభిక్షం గొంతు పూడుకుపోయింది. మరి మాట్లాడలేకపోయాడు. అతని కళ్ల వెంబడి కన్నీళ్లు బొటబొటా కారిపోయాయి.

వేదిక మీదికి చేరిన కుమారి.. తడుముకుంటూ ధర్మభిక్షం వద్దకు వచ్చింది. అతని సమీపంలోకి వచ్చిన కుమారి కదలికల్ని అతను గుర్తించాడు.

''బాబూ!''.. అంటూ ఓ వృద్ధురాలు ధర్మభిక్షాన్ని చుట్టుకునిపోయింది.

ఆమె కళ్లు కూడా తడిచి ముద్ద అయిపోయి ఉన్నాయి. ఆమె కుమారి కాదన్న విషయం తెలుసు. ఎవరీమె!? అతని మదిలో లక్ష సందేహాలు..

''మీ అమ్మ కంజిరమ్మ. వెతికి పట్టుకుని తెచ్చాను''.. కుమారి చెబుతున్న మాటలు వినిపించడం లేదు.

''అమ్మా''.. అంటూ బావురుమన్నాడు.

కంజిరమ్మ కొడుకుని చుట్టుకుని పోయింది. ఆమె కంటి నుంచి వస్తున్న కన్నీటి ధార అతని చొక్కాను తడిపేసింది.

మరో పక్కనుంచి కుమారి అతణ్ని వాటేసుకుంది. మూతపడిన ఆమె కళ్లు కూడా వర్షిస్తున్నాయి. అనిర్వచనీయమైన ఆ దృశ్యం.. అక్కడి వారిని కట్టిపడేసింది.

ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్న కన్నతల్లి తన పక్కనున్నా చూడలేకపోతున్న ధర్మభిక్షం.. దుఃఖంతో వస్తున్న వెచ్చని కన్నీళ్లు రెప్పలు విప్పలేని కళ్ల నుంచి ధారాపాతంగా కారాయి. ఆ కన్నీళ్లు బొట్లుగా కుమారి తలపై రాలాయి.

ప్రేక్షకుల కరతాళధ్వనులు మిన్నంటిపోయాయి. ■

## పొత్తూరు రాజేంద్రప్రసాద్ వర్మ



విద్యార్థిదశ నుంచే రచనా వ్యాసంగంపై మక్కువ పెంచుకున్నారు పొత్తూరు రాజేంద్రప్రసాద్ వర్మ. రాయాలని అనిపించినప్పుడే కలం పడుతూ.. మంచిమంచి కథలను పాఠకులకు అందిస్తున్నారు. స్వస్థలం విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం. చదువుకునే రోజుల్లో జర్నలిస్టుగానూ పనిచేశారు. ప్రస్తుతం విశాఖ జిల్లా దేవరాపల్లి మండలం ఎ. కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 300 వరకూ సాంఘిక, బాలల, డిటెక్టివ్ కథలు, 50 కవితలు వివిధ పత్రికల్లో ప్రచురితం అయ్యాయి. నాలుగు నవలలు.. సీరియళ్లుగా వెలువడ్డాయి. అనేక కథలకు బహుమతులు అందుకున్నారు. వర్ధమాన రచయితల సంఘం, కళాసాహితి సంస్థలకు వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉంటున్నారు. పురాతన భీమునిపట్నం చరిత్రను కళ్లకుకట్టే చారిత్రక కథలు.. వివిధ పత్రికల్లో సీరియళ్లుగా వచ్చాయి. అల్లూరి సీతారామరాజుపై చేసిన పరిశోధన పుస్తకాన్ని ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆవిష్కరించి ప్రశంసలు అందించారు. రెండుసార్లు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్నారు. 'గంజాయివనం' నవల అంపశయ్య నవీన్ పురస్కారాన్ని దక్కించుకున్నది.